పిక్నిక్ బిర్యానీ
ఉదయం 7 గం॥లకే రెడీ
పార్శిల్ కోసం.. 83318 23334
JMR Veg. & Non-Veg Restaurant
Flavours
జె.ఎం.ఆర్. ఫ్లేవర్స్
వెజ్ & నాన్‌వెజ్ రెస్టారెంట్
టూటౌన్ పోలీస్‌స్టేషన్ ఎదురుగా, శ్రీకాకుళం

సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

https://www.satyamdaily.net/

సోమవారం 18-11-2024

సంపుటి: 20 సంచిక: 199

పేజీలు: 4 వెల: రూ.1









## వైకాపా కాంట్రాక్టర్లకే
# ఇక్కడ ఇసుక ఫ్రీ

- గతంలో దోచేసిన అనుభవమే కొలమానం
- హయాతినగరం ర్యాంపు తోటపాలెంకు షిఫ్ట్
- కిల్లిపాలెంలో తవ్వుతున్నవారే తోటపాలెంకు రోడ్డేస్తున్నారు
- రవాణా ఛార్జీలు తగ్గుతాయని నగరాన్ని తవ్వేస్తున్నారు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఉచిత ఇసుక పాలసీకి స్పష్టమైన తలాతోక లేకపోవడంతో ఇసుక వ్యాపారం ప్రభుత్వానికి అప్రతిష్ట తీసుకువస్తోంది. సంక్షేమ పథకాల అమలు కోసం, రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాల కోసం ఇసుక మీద సీనరేజ్‌ను వసూలు చేయాల్సివున్నా గ్రామాల్లో పదిమంది బతకడం కోసం, తక్కువ ధరకు ఇసుక అందుబాటులోకి వస్తే నిర్మాణ రంగం ఊపందుకుంటుందనే కోణంలో ఇసుకను ఉచితంగా సరఫరా చేసేందుకు అనుసరిస్తున్న విధానం ఇప్పుడు కూటమి ప్రభుత్వ కొంప ముంచుతోంది. పేరుకే జిల్లాలో 16 ర్యాంపుల్లో తవ్వకాలకు అనుమతులిచ్చినా జిల్లా పొడవునా ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. చివరకు భూగర్భ జలాలు అడుగంటిపోతున్నా, అక్కడ ఇసుక లేదని స్వయంగా మైన్స్ & జియాలజీ శాఖ నివేదికలిచ్చినా అధికారులు మాత్రం ఎక్కడికక్కడ ఇసుక తవ్వుకోడానికి పచ్చజెండా ఊపుతున్నారు. కేవలం శ్రీకాకుళం జిల్లా కేంద్రానికి ఆనుకొని ఉన్న ర్యాంపులకు విపరీతమైన డిమాండు ఉండటంతో ఇక్కడ ఎన్ని అక్రమాలు చేసైనా సొమ్ములు సంపాదించాలని ప్రయత్నిస్తున్నారు. ఇందుకోసం స్థానిక టీడీపీ నేతలకు పచ్చనోట్ల వాసన చూపించి పెద్దఎత్తున దోపిడీకి తెర లేపుతున్నారు. కిల్లిపాలెంలో అసలు ఇసుకే లేదని, ఇక్కడ నదిలో మట్టి బయటకు వచ్చిందని, దీనివల్ల నీరు కలుషితమైపోయిందని, పంటలకు కూడా సాగునీరు అందడంలేదని స్థానికులు పోరాడుతుంటే, సరిగ్గా అదే ర్యాంపులో ఇసుకను తవ్వుకుపోతున్నారు. కారణం ఇది శ్రీకాకుళం హెడ్‌క్వార్టర్‌కు రెండు కిలోమీటర్ల లోపే ఉంది. విశాఖపట్నం వెళ్లాలంటే 100 కిలోమీటర్ల దూరం మాత్రమే ఉంటుంది. అందువల్ల జిల్లాలో అనేక చోట్ల ఇసుక లభ్యత ఉన్నా వద్దన్నచోటే తవ్వకాలు చేపడుతున్నారు. దూరం ఎంత తగ్గితే రవాణా ఛార్జీలు అంత తగ్గుతాయి కాబట్టి ప్రస్తుతం ఉన్న పోటీలో మిగతావారి కంటే తక్కువకు ఇసుకను అమ్మొచ్చని శ్రీకాకుళం చుట్టూ తవ్వకాలు జరుపుతున్నారు. హైదరాబాద్ కేపీహెచ్‌బీ కాలనీ ఫేజ్-9లో ఉంటున్న మెస్సర్స్ వెంకటేష్ హోతా ప్రాపర్టీస్‌కు కిల్లిపాలెంలో ఇసుకను తవ్వుకునే మహద్భాగ్యాన్ని మన అధికారులు కల్పించారు. అలాగే ఇప్పటి వరకు నగర పరిధిలో హయాతినగరం ర్యాంపునకు కూడా అనుమతులు ఇచ్చారు. కాకపోతే ఈ ప్రాంతంలో ఉన్న ర్యాంపునకు లారీలు వెళ్లడానికి సరిపడా రోడ్డు లేదు. అందుకే నాటుబళ్లు ద్వారా ఇక్కడ ఇసుక వ్యాపారం జరుగుతుంటుంది. ఒక్కసారి నదిలోకి లారీలను క్యూ కట్టించి ప్రొక్లయినర్ ద్వారా గంటల్లో నింపేసి రోజుల్లో సొమ్ములు లెక్కించుకోవాల్సిన చోట టైరుబళ్లతో తలనొప్పి ఎందుకనుకున్నారో ఏమో..? ఇక్కడ ర్యాంపును తోటపాలెం వైపునకు తరలించి ఇసుకను పెద్ద ఎత్తున తోడేస్తున్నారు. ఇది కూడా కిల్లిపాలెంలో నిరసనలు వ్యక్తమవుతున్న చోట ఇసుక తవ్వకాలకు కాంట్రాక్ట్ పొందిన వెంకటేష్ హోతా సంస్థకే అధికారులు కట్టబెట్టారు. అదేంటి..? టెండర్‌లో దక్కించుకున్నదానికి కట్టబెట్టారు అని చెబుతున్నారు అంటే.. అందుకూ ఒక కారణముంది. ఇసుక తవ్వకాలకు పిలిచిన టెండర్లలో బిడ్ ప్రకారమో, లేదూ అంటే నిబంధనల ప్రకారమో ఎవరికీ తవ్వకాలకు అనుమతులు ఇవ్వలేదు. కేవలం తాత్కాలికంగా ఏడు రోజుల పాటు తవ్వుకోడానికి అనుమతులిచ్చారు. ఈ పుణ్యకాలం గడిచిపోయి చాలా రోజులైంది. అయినా ఇసుక తవ్వకాలు ఆగలేదు సరికదా.. హద్దులను మార్చుకొని మరింత జడలు విప్పి జిల్లా సరిహద్దులు దాటిపోతుంది. కూటమి ప్రభుత్వం అధికారంలో ఉంది కాబట్టి ఆ నేతలకు ఉపాధి కల్పించేందుకే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇటువంటి పాలసీని తీసుకువచ్చారని భావిస్తే, తప్పులో కాలేసినట్టే. ఎందుకంటే.. శ్రీకాకుళం నగరానికి ఆనుకొని ఉన్న కిల్లిపాలెం, హయాతినగరం పేరుతో తోటపాలెంలో నడుపుతున్న ర్యాంపులను దక్కించుకున్న హోతా వెంకటేష్ ప్రాపర్టీస్ గతంలో వైకాపా ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు అనధికారికంగా ఆమదాలవలస నియోజకవర్గంలో ఇసుక ర్యాంపులు నిర్వహించి పెద్ద ఎత్తున అప్పటి ఆమదాలవలస వైకాపా నాయకుడికి సొమ్ములు ముట్టజెప్పి మిగిలిన మూటలు ఈయన పట్టుకుపోయారన్న ఆరోపణలు ఉన్నాయి. వైకాపా హయాంలో రాష్ట్రవ్యాప్తంగా ఇసుక తవ్వకాలను జేపీ వెంచర్స్‌కు గంపగుత్తగా కట్టబెట్టారు. ప్రతీచోట వారే ఇసుకను తవ్వుకున్నారు. ఒక్క ఆమదాలవలస నియోజకవర్గంలో మాత్రం జిల్లాలో జేపీకి సమాంతరంగా ఇసుక దందా నడిచింది. దీనికి అడ్డుకట్ట వేయడం కోసం క్యూఆర్ కోడ్‌ను ప్రవేశపెడితే, దానికి ప్రతిగా ఇక్కడా ఒక క్యూఆర్ కోడ్

- మిగతా 4లో

## కంచిక చెరువులో ప్లాస్టిక్ వ్యర్థాలు

(సత్యంన్యూస్, కొత్తూరు)

మండలం కేంద్రంలో ఉన్న కంచికచెరువులో ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోయి నీరు నిరుపయోగంగా మారింది. మండల కేంద్రంలో ఉన్న అన్నిరకాల షాపుల నుంచి ఉత్పన్నమయ్యే వ్యర్థాలను చెరువుకు వచ్చే హద్దుబంగి గడ్డలో వేసేస్తున్నారు. గెడ్డ నుంచి వచ్చే వ్యర్థాలు చెరువులో పేరుకుపోతున్నాయి. చెరువులో వ్యర్థాలతో పూడిక పేరుకుపోయి నీటి సామర్థ్యం క్రమంగా తగ్గిపోతుంది. అయకట్టుకు ప్రధాన నీటి వనరుగా ఉన్న కంచెక చెరువులో నీటి నిల్వ సామర్థ్యం తగ్గడంతోపాటు నీరు కలుషితమవుతుందని ఆయకట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కలుషితమైన నీటి వల్ల పంటలకు దోమపోటు వచ్చి పంట దిగుబడి తగ్గిపోతుందని రైతులు చెబుతున్నారు. దీనిపై ఇరిగేషన్, పంచాయతీరాజ్ శాఖ అధికారులు స్పందించి చెరువులో వ్యర్థాలు పూర్తిగా తొలగించాలని కోరుతున్నారు.



## వరం విద్యార్థులకు ఉపాధ్యాయుల అభినందన

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

బాలల దినోత్సవం సందర్భంగా రోటరీ క్లబ్, ఇన్‌స్పైర్ స్కూల్ వారు నిర్వహించిన పెయింటింగ్ పోటీల్లో స్థానిక అంధవరపు వరహానరసింహం మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు, క్యాష్ అవార్డు అందుకున్నారు. కెరీర్ ఫర్ అండర్ జియో వారు నిర్వహించిన జిల్లా స్థాయి పెయింటింగ్, హ్యాండ్ రైటింగ్, నృత్య పోటీల్లో విద్యార్థులు పాల్గొని పలు బహుమతులు అందుకున్నారు. విద్యార్థులకు తగిన విధంగా తర్ఫీదు ఇచ్చిన డ్రాయింగ్ మాస్టర్ యర్రా సత్యనారాయణను, గెలుపొందిన విద్యార్థులను ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు ఉరిటి రామనాధరావు, పాఠశాల ఉపాధ్యాయులు, ఎస్ఎంసీ సభ్యులు అభినందించారు.



## జగనన్న కాలనీల
## అవినీతిపై చర్యలు తీసుకోండి
### రెవెన్యూమంత్రిని కోరిన ఎంజీఆర్

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



పాతపట్నం నియోజకవర్గంలో పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వ భూములను కేటాయించాలని రాష్ట్ర రెవిన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు కోరారు. ఈమేరకు సచివాలయంలో కలసి వినతిపత్రం అందజేశారు. అలాగే గత ప్రభుత్వ హయాంలో జగనన్న కాలనీల పేరుతో జరిగిన అవినీతి, విలువైన ప్రభుత్వ స్థలాల ఆక్రమణలపై విచారణ జరిపి చర్యలు చేపట్టాలని విన్నవించారు.

## ఈనెల19న గుడ్ మార్నింగ్ ఇచ్ఛాపురం

(సత్యంన్యూస్, ఇచ్ఛాపురం)

ఈనెల 19న ఉదయం 6:30 నుంచి 7 గంటలకు స్థానిక సూరింగి రాజా వారి మైదానంలో గుడ్ మార్నింగ్ ఇచ్ఛాపురం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు సీడాప్ మాజీ చైర్మన్ సాడి శ్యాంప్రసాద్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈమేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మార్నింగ్ వాక్‌కు వచ్చే పట్టణ ప్రముఖులతో నగరానికి ప్రధానమైన వంతెన అవసరంపై చర్చించేందుకు స్థానికంగా కొందరు మిత్రుల ఆలోచనలు మేరకు ఈనిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. ఇచ్ఛాపురం పట్టణానికి ప్రవేశ మార్గంలో ఉన్న బహుదానదిపై వంతెన నిర్మాణం టెండర్ దశలోనే ఆగిపోయిందన్నారు. నిత్యం వేలాదిమంది పట్టణానికి రాకపోకలు సాగించే వంతెన కూలిపోవడంవల్ల భారీ వాహనాలు హైవే నుంచి బెల్లుపడ ఇరుకురోడ్డు మార్గంలో వస్తుండడం వల్ల నిత్యం ప్రమాదాలు జరుగుతున్నట్టు తెలిపారు. ఇచ్ఛాపురం సమీపంలో నేషనల్ హైవే నుంచి బెల్లుపడ మార్గంలోకి వాహనాలు ట్రాఫిక్ పెరగడం వల్ల ప్రమాదాలు పెరిగి ప్రయాణికులు ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదాల నివారణకు గతంలో జిగ్‌జాగ్ బ్యారికాడ్స్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రస్తుతం బ్యారికాడ్స్ లేవని, రాత్రివేళ లైటింగ్స్ లేదని పేర్కొన్నారు. ఎన్‌హెచ్ఏఐ సిబ్బందితో మాట్లాడితే బారికేడ్స్ ఏర్పాటుకు రూల్స్ ఒప్పుకోవడం లేదని చెబుతున్నారని తెలిపారు. వంతెనమార్గం లేకపోవడం వల్ల పట్టణంలో వ్యాపారాలు దెబ్బతిన్నాయన్నారు. అదేవిధంగా విద్యారులు, రోగులు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. ఈనెల ఒకటిన ఈదుపురం గ్రామానికి వచ్చిన సీఎం చంద్రబాబుకు వంతెన నిర్మాణంపై ప్రకటన చేస్తారని స్థానికులంతా ఎదురుచేసినా నిరాశే మిగిలిందన్నారు. వంతెన నిర్మాణం కొసం స్థానిక ప్రజా ప్రతినిధులు ఎటువంటి అభ్యర్థన చేయకపోవడం వల్ల వంతెన నిర్మాణం ఇప్పటల్లో సాధ్యం కాదని తేలిపోయిందన్నారు. వంతెన పనులు ఇప్పుడు ప్రారంభం కాకపోతే ఖచ్చితంగా కనీసం మరో ఐదేళ్లు ఇచ్ఛాపురం ప్రజలు ఇబ్బందులు తప్పవన్నారు. రాజకీయాలకతీతంగా వంతెన నిర్మాణం కోసం అందరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. స్థానిక ఎమ్మెల్యే, జిల్లాకు చెందిన రాష్ట్ర, కేంద్ర మంత్రులకు వంతెన అవసరం, ఆవశ్యకత తెలియజేయడానికి మొదటి ప్రయత్నంగా గుడ్ మార్నింగ్ ఇచ్ఛాపురం కార్యక్రమాన్ని నిర్వహించి పట్టణ ప్రజల అభిప్రాయాలను తెలియజేయడానికి రాజావారి మైదానంలో నిర్వహించే కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.



## 108 సర్వీసులను ప్రభుత్వమే నిర్వహించాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

రాష్ట్ర ప్రభుత్వమే 108 సర్వీసులను నేరుగా నిర్వహించాలని, స్లాబ్ ప్రకారం అందరికీ వేతనాలు చెల్లించాలని, సర్వీసును బట్టి స్లాబ్‌లను అప్‌గ్రేడ్ చేయాలని ఏపీ 108 సర్వీసెస్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లాశాఖ ప్రతినిధులు కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా పని చేస్తున్న 108 కాంట్రాక్ట్ ఉద్యోగులుగా సమస్యలను పరిష్కరించమని కోరుతూ కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 25 తర్వాత సమ్మె నిర్వహించాలని రాష్ట్ర కమిటీ నిర్ణయించినట్లు తెలిపారు. ధర్నాలో సంఘం జిల్లా అధ్యక్షుడు విజయ్‌మోహన్, ఈశ్వర్, శ్రీను, మురళీ, చిన్నబాబు, సతీష్, 108 ఉద్యోగులు పాల్గొన్నారు.



## టీటీడీ చైర్మన్‌తో ఎంపీ కలిశెట్టి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

టీటీడీ ద్వారా చేపట్టడానికి అవకాశం ఉన్న కొన్ని అంశాలపై సోమవారం తిరుపతిలోని అన్నమయ్య భవన్‌లో టీటీడీ చైర్మన్ బి.ఆర్.నాయుడుని విజయనగరం ఎంపీ, ఐ.టీ కమ్యూనికేషన్ పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు మర్యాదపూర్వకంగా కలిశారు. టీటీడీకి సంబంధించిన అభివృద్ధి కార్యక్రమాలపై వినతిపత్రం అందించారు. ఎస్సీ, ఎస్టీ, మత్స్యకార ప్రాంతాల్లో ఆలయాలు, ఫంక్షన్ హాల్స్ నిర్మాణం, హిందూ ధార్మికతను పొడిగించేందుకు, ఎస్సీ, ఎస్టీ ప్రాంతాల్లో వేంకటేశ్వరస్వామి ఆలయాలు నిర్మించాలని కోరారు. ప్రతి నియోజకవర్గంలో గోవు సంరక్షణ కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరారు. అండమాన్ నికోబార్, కొండములగాం (ఎచ్చెర్ల నియోజకవర్గం), ముంబై, భువనేశ్వర్ వంటి చోట్ల వేంకటేశ్వరస్వామి ఆలయాలను నిర్మించాలని కోరారు. టీటీడీలో జరుగుతున్న అన్నదాన సేవలను విశాఖపట్నం, ఢిల్లీ, హైదరాబాద్ లాంటి నగరాలకు విస్తరించాలని కోరారు. 2019 తర్వాత టీటీడీ నిర్మించిన కొత్త ఫంక్షన్ హాల్స్‌లో పండుగలు, భక్తి సమ్మేళనాలు నిర్వహించడంపై ప్రోత్సాహం ఇవ్వాలని సూచించారు. వెంకటేశ్వర స్వామి నామస్మరణ కోసం రుషికొండ దేవాలయం నుంచి ఆర్కే బీచ్, భీమిలి వైపు స్పీకర్లు ఏర్పాటు చేయాలని కోరారు. వెంకటేశ్వర భక్తి ఛానల్ ప్రత్యక్ష ప్రసారాలు రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రసారం అయ్యేలా చూడాలని కోరారు.



## గ్రంథాలయంలో డిబేటింగ్, వక్తృత్వ పోటీలు

(సత్యంన్యూస్, లావేరు)

లావేరు శాఖా గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకొని విద్యార్థినీ విద్యార్థులకు సోమవారం డిబేటింగు, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి మురిపాక శ్రీనివాసరావు మాట్లాడుతూ మూడు రోజుల పాటు వివిధ పోటీలు ఉంటాయని, ఈ నెల 20న మధ్యాహ్నం పోటీలో పాల్గొన్న విజేతలకు బహుమతుల ప్రధానం చేస్తామని తెలిపారు. అదేరోజున సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, విద్యార్థులు హాజరై వారోత్సవాల ముగింపు సభ విజయవంతం చేయాలని ఆయన కోరారు.



• ఎడిటోరియల్

# విజ్ఞానంతోనే జగత్తు వికాసం

ఆ మధ్య పూణేలో పన్నెండేళ్ల విద్యార్థి రెంతస్తుల భవనం మీద నుంచి దూకి తీవ్రంగా గాయపడ్డాడు. సెల్‌ఫోన్లో బ్లూవేల్ గేమ్ ఆడుతూ, ఛాలెంజ్‌లో భాగంగా పైనుంచి దూకేశాడు. మహారాష్ట్రలో పదమూడేళ్ల బాలుడు ఎత్తయిన భూభాగం నుంచి లోయలోకి ఉరికాడు. హనుమాన్ చాలీసా పఠిస్తూ, దూకితే, గాల్లో ఎగరవచ్చునని అతడు భావించాడు. నీటి కొలనులో ఈత నేర్చుకుంటున్న ఇద్దరు పిల్లలు ఈత వచ్చులే అన్న ధీమాతో నది మధ్యలోకి వెళ్లి, ప్రమాదంలో చిక్కుకుపోయిన సంఘటన ఇటీవల తెలంగాణాలో జరిగింది. కథలకు, ఊహలకు, వాస్తవాలకు మధ్య ఉన్న తేడా గురించి పిల్లలకు స్పష్టంగా తెలియాలి. అప్పుడు మాత్రమే ఇలాంటి అవాంఛిత పరిస్థితుల నుంచి బయటపడగలుగుతారు. పిల్లలు ఎదుగుతున్న క్రమంలో ప్రతిదీ నేర్చుకుంటారు. ఆ నేర్చుకోవడంలో కథలూ, ఊహలూ వాస్తవాన్ని అర్థం చేసుకోవటానికి దోహదపడాలి తప్ప– ఆ వాస్తవానికి విరుద్ధంగా ఉండకూడదు. అందువల్లనే చదువులో శాస్త్రీయ దృక్పథం ఉండాలి. ఏది నిజమో అదే పిల్లలకు తెలియాలి. ప్రకృతిలోని ప్రతి చర్య వెనుకా ఒక క్రమబద్ధమైన కారణం ఉంటుందని తెలియాలి. మహత్తుల వల్ల, నమ్మకాల వల్ల ఏదీ జరగదని తెలియజెప్పాలి. ఎవరికి ఏ నమ్మకం ఉన్నా వారంతా వాస్తవంలోనే బతుకుతారు. శాస్త్రీయ దృక్పథం ఆధారంగా రూపొందిన వస్తు సముదాయపు సహకారంతోనే జీవిస్తారు. తమ నమ్మకాలను సైతం సైన్సు ఆధారంగా రూపొందిన పుస్తకాల ద్వారా, పత్రికల ద్వారా, మైకుల ద్వారా, ఇంటర్నెట్ ద్వారానే ప్రచారం చేసుకుంటారు. మానవ శ్రమ, మేథ తయారుచేసిన వస్తువులను మాత్రమే వారూ వాడతారు. అందుకు అతీతమైన, భిన్నమైన మహత్తు వస్తువులు, ప్రత్యామ్నాయ పద్ధతులూ వారి వద్ద ఉండవు. మరి దృశ్యం ఇంత స్పష్టంగా మన కళ్లకు కనపడుతున్నప్పుడు పిల్లలను అమోమయానికి గురి చేసే నమ్మకాల వైపు ఎందుకు మళ్లించాలి? పిల్లల్లో ప్రతి విషయాన్ని తెలుసుకోవాలనే ఆసక్తి ఎక్కువగా ఉంటుంది. దానినే 'విజ్ఞాన జిజ్ఞాస' అంటారు. ఎందుకు? ఏమిటి? ఎలాగ? ఎప్పుడు? వంటి క్వశ్చన్లను పిల్లలు నిరంతరంగా సంధిస్తారు. వాటికి ఓపికగా జవాబులు చెబుతూ ఉంటే, మళ్లీ మళ్లీ అడిగి మరిన్ని విషయాలు తెలుసుకుంటారు. ఆ జవాబుల్లో సైన్సు ఉంటే, పిల్లలు శాస్త్రీయంగా ఆలోచిస్తారు. చాదస్తం నూరిపోస్తే అందుకు అనుగుణంగానే తయారవుతారు. మనుషులు తొలినుంచీ విజ్ఞాన జిజ్ఞాసతో ఆలోచిస్తూ ఉన్నారు కాబట్టే– రాతియుగం నుంచి రాకెట్టు యుగం దాకా ప్రస్థానం సాగించారు. "ఇది ఇంతే! ఇదిలాగే ఉంటుంది.. ఎవరూ ప్రశ్నించకూడదు. ఎవరూ గొంతెత్తకూడదు." అనుకుంటే– మనమింకా పురాతన కాలంలోనే ఉండేవాళ్లం. మిగతా జంతు సమూహాలన్నిటి కన్నా మనుషులు తెలివైన వారు కాబట్టి, మెదడు అభివృద్ధి చెందిన వారు కాబట్టి– ఆలోచించకుండా ఉండలేరు. చుట్టూ ఉన్న పరిస్థితులను పట్టించుకోకుండా ఉండలేరు. ప్రశ్నించకుండా, పరిష్కరించకుండా అసలే ఉండలేరు. అచేతనంగా ఉండలేని చైతన్యంలో నుంచే నూతన భావాలు, ఆవిష్కరణలు పుట్టుకొస్తాయి. పురాతన భావాలూ, పద్ధతులూ కాలగర్భంలో కలిసిపోతాయి. ఇది నిత్యం మన కళ్లముందు జరుగుతూనే ఉంది. పక్షుల వలె గాలిలో ఎగరాలని, చంద్రుడి మీదికి చేరాలని, చేపల వలె నీటిపై చరించాలని ఆదిమ కాలపు మనుషుల ఆశ. ఆ ఆశ ఆలంబనగానే అనేక ఊహలను, కథలను అల్లుకున్నారు. ఆధునిక కాలంలో కొందరు ఆ కలలను వాస్తవంలోకి తెచ్చే అనేక ప్రయత్నాలు చేశారు. పక్షుల వలె భుజాలకు రెక్కలను కట్టుకొని గాల్లో ఎగిరే ప్రయత్నం చేశారు. ఎందరో గాయపడ్డారు. కొందరు ప్రాణాలను సైతం కోల్పోయారు. మనిషి తనకు తానుగా ఎగరలేడని వందేళ్ల క్రితమే నిర్ధారణకు వచ్చారు. పక్షులు ఎగరటానికి, చేపలు ఈదటానికి ఏఏ ప్రత్యేకతలు అనుకూలిస్తున్నాయో అధ్యయనం చేశారు. ప్రతి చర్య వెనుకా, సామర్థ్యం వెనుకా ఒక ప్రత్యేకమైన సూత్రం ఉంటుందని కనుగొన్నారు. వాటి ఆధారంగా విమానాలను, ఓడలను నిర్మించుకున్నారు. సూత్రబద్ధత అంటే సైన్సు. విమానం, రాకెట్టు, ఓడ, కారు, టూవీలరు, కుక్కరు, మిక్సీ, ట్యూబులైటు, టెలివిజన్, సెల్‌ఫోను.. ఇలాంటి సర్వ వస్తు సామగ్రి సైన్సు సూత్రాల ఆధారంగానే నడుస్తున్నాయి. ఆధునిక కాలంలో ఇంత దూరం వచ్చాక, పురాతన కాలంలోనే గొప్పగా ఉన్నామన్నట్టుగా ప్రచారం చేసుకోవటం ఆత్మవంచన అవుతుంది. ముఖ్యంగా రేపటి పౌరులుగా, సమాజ నిర్మాతలుగా ఎదగాల్సిన పిల్లల మనసుల మీద ప్రతికూలంగా ప్రభావం పడుతుంది. పురాణ కథలను కథలుగానే పిల్లలకు పరిచయం చేయాలి. వాటినిండా అద్భుతాలు, అతీత శక్తులూ నిజంగానే ఉన్నట్టు నూరిపోయకూడదు.





## సూపర్‌స్టార్ కొడుకు

# విభిన్న పంథా..!!

తండ్రి ఒక సుప్రసిద్ధ నటుడు.. మాలీవుడ్ ఇండస్ట్రీలోనే టాప్ మోస్ట్ హీరో.. ప్రాంతాలకతీతంగా పేరు సంపాదించిన వెర్సటైల్ ఆర్టిస్ట్.. అలాంటి నటుడి కొడుకు సాధారణంగా నటుడే అయ్యే అవకాశాలే ఎక్కువ. వారసత్వ రాజకీయాలు, వారసత్వ ఉద్యోగాలెలాగో.. వారసత్వ నటన కూడా మనం చూస్తున్నదే. అయితే, తానూ తండ్రిలాగే మంచి నటుడు. బాలనటుడిగా అవార్డ్సు సాధించాడు. తాజాగా కూడా ఓ పెద్ద హిట్ ఇచ్చిన హీరో. కానీ, ఇంతవరకే అయితే.. అతడి గురించి మనం ఇంతగా మాట్లాడుకోం. చాలామంది నాన్నలు, అన్నలు, తల్లిదండ్రుల నుంచి అందివచ్చిన వారసత్వంతో ఎదిగినవారిలా తాను పరిమితమైపోతే కూడా పెద్దగా మాట్లాడుకోవాల్సిన, ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిన జాగా ఉండేది కాదు. కానీ, అతనో భిన్నమైన క్యారెక్టర్. తండ్రి సినిమా తెరపై మాత్రమే భిన్నమైన క్యారెక్టర్స్ పోషిస్తే.. తాను నిజజీవితంలోనే అలాంటి ఓ వైవిధ్యమైన క్యారెక్టర్. అందుకే అతడి గురించి ఈ మన ముచ్చట!



అతనే ప్రణవ్.. మళయాళ స్టార్ హీరో మోహన్‌లాల్ తనయుడు. తండ్రి సంపాదించిన ఆస్తి.. వారసత్వంగా అందివస్తూ తన ప్రతిభ కూడా తోడై హిట్టవుతున్న సినిమాలు, సంఘంలో పేరు.. ఇవన్నీ సరే. అందులోనే తేలలేనంత మునిగిపోవచ్చు. అంత బిజీ ఇండస్ట్రీ అది. కానీ, ప్రణవ్ మోహన్‌లాల్ ఓ వెర్సటైల్ పర్సనాలిటీ. ప్రయాణాలంటే ఇష్టపడతాడు. తనకు ఛాన్స్ దొరికింది కదా.. తండ్రి ఇండస్ట్రీలో పీక్స్‌లో ఉన్నాడు. గోల్డెన్ స్పూన్ పుట్టుక.. కాబట్టి అవకాశం ఉండగానే దున్నిపడేయాలన్న ఆశ లేదు. దీపముండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలన్న చింత అంతకన్నా అవసరం లేదు. అందుకే ఇప్పుడు స్పెయిన్ బాట పట్టాడు. ఎక్కడో స్పెయిన్‌లో ఓ పొలంలో పని చేస్తున్నాడు. అప్పుడప్పుడూ గొర్ల కాపరి అవతారమెత్తుతుంటాడు. గుర్రాలు, మేకలు కాస్తూ పశులపాపడైపోతాడు. క్వైట్ ఇంట్రెస్టింగ్ కదా? జస్ట్ లైక్ 'ఇన్ టు ద వైల్డ్' సినిమా తరహాలోనే సాగుతోంది ప్రస్తుతం ప్రణవ్ జీవితం.

తన జీవితాన్ని తాను పోషించుకునేందుకు వ్యవసాయ క్షేత్రాల్లో వ్యవసాయ కూలీ పనులు చేస్తున్నాడు ప్రస్తుతం ప్రణవ్. తను స్టార్ నటుడి కొడుకని, తానూ ఓ స్టార్ నటుడేనన్న సంగతి స్పెయిన్‌లో ఎందరికి తెలుసు..? అందుకే, చెప్పిన పని చేస్తే భోజనం పెట్టి షెల్డర్ ఇచ్చేందుకు ఒప్పుకున్నారు. అలా, డబ్బు తీసుకుని పని చేయడం కాకుండా.. వర్క్ అవే ప్రోగ్రాంలో భాగంగా పని చేస్తే షెల్టర్ దొరికి, భోజనం పెట్టే చోట.. మేకలు, గుర్రాలు కాస్తున్నాడు. కానీ, ఒంటరి ప్రణవ్‌కు స్నేహితులూ ఎక్కువే. పుస్తకాలు, గిటార్‌పై కాసింత సంగీతం అవే అతగాడి స్నేహితులు!

2002లో బాలనటుడిగా ఒన్నమన్‌లో తొలిసారి నటనలోకి ప్రవేశించాడు. తండ్రి నటనా వారసత్వం అతడికి ఇండస్ట్రీలోకి రావడానికి ఓ గ్రీన్ కార్డ్ ఎంట్రీ. 2003లో పునర్జని అనే సినిమాలో నటించాడు. ఉత్తమ బాలనటుడిగా కేరళ రాష్ట్ర చలనచిత్ర అవార్డ్ అందుకున్నాడు. 2018లో హీరోగా మొట్టమొదటి సినిమా ఆదితో అలరించాడు. ఆ ఏడాది అత్యధిక వసూళ్లు రాబట్టిన చిత్రంగా కూడా ఆది సినిమా రికార్డులకెక్కింది. అయితే, ఒకవైపు సక్సెస్ సినిమాలు చేస్తూ.. అదే స్థాయిలో ఆఫర్స్ వస్తూ.. తను కింద పడిపోయినా లేపడానికి తండ్రి మోహన్‌లాల్ రూపంలో బలమైన బేస్‌మెంట్ ఉన్నా.. ఇవేవీ ప్రణవ్‌ను అంతగా ఆకట్టుకోనట్టున్నాయి. తన లోకం వేరు. తన ఆలోచనలు వేరు. అందుకే, ఇవేవీ అడ్డుకోలేకపోయాయి.

కట్ చేస్తే ప్రణవ్ ఇప్పుడు స్పెయిన్‌లో ఉన్నాడట. అక్కడ గొర్లెను కాస్తాడు.. వ్యవసాయం చేస్తాడు.. తన బతుకేదో తాను బతుకుతాడు.. తన పుస్తక స్నేహితులను మాత్రం వెంట పెట్టుకుని ఎప్పటికప్పుడు చదువుతుంటాడు. తన వెంట పెట్టుకునే గిటార్ పై లైట్ మ్యూజిక్‌తో.. ప్రకృతిలో ఒదిగిపోతాడు. ఇవన్నీ ఈమధ్య ఓ ఇంటర్వ్యూలో ప్రణవ్ తల్లి, మోహన్‌లాల్ సతీమణి సుచిత్ర పంచుకోవడంతో వెలుగులోకొచ్చిన విషయాలు. దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలనుకుంటూ తమ తర్వాత తరం కూడా తమలాగే ఉండేలా వారసులను నటులు చేస్తున్నవారు, రాజకీయాల్లోకి తీసుకొస్తున్నవారు, కంపెనీల్లో సీఈవోలగా కూర్చోబెడుతున్నవారెందరో! అలాంటి అవకాశం ఉండీ కూడా ప్రణవ్ విభిన్నమైన వైవిధ్య జీవనాన్ని కోరుకుంటూ బహుదూరపు బాటసారిలా ఓ పర్యాటకుడై పచార్లు వేస్తుండటం విశేషం. ప్రణవ్ తన మాట వింటాడనే భావన, పెడచెవిన పెట్టడనే నమ్మకం చాలామందిలో ఉందని, తన కజిన్స్ కూడా పదే పదే చెబుతుంటారని చెబుతోంది సుచిత్ర. అయితే, అది నిజమేనని.. కానీ, తాను నమ్మిన విషయాలకు కట్టుబడే మనస్తత్వం కూడా ప్రణవ్‌లో కనిపిస్తోందంటోంది. తన కొడుకు మొండివాడేం కాదు.. అవునంటే వద్దనీ.. వద్దంటే అవునని వారించే బాపతు అంతకన్నా కాదు, కానీ తాను సరైందని నమ్మినదాన్ని మాత్రం ఆచరించి తీరుతాడని చెప్పుకొచ్చారావిడ.

ప్రణవ్ చివరగా 2024లో వర్షాగల్కు శేషం అనే సినిమాలో నటించాడు. ఆ తర్వాత అతడి ప్రాజెక్టేంటన్న ఒకింత ఎదురుచూపులు అటు మోహన్ లాల్ అభిమానుల్లోనూ.. సహజంగానే, మోహన్ లాల్ వంటి స్టార్ నటుడి కొడుకుగా ఏర్పడ్డ ప్రణవ్ అభిమానుల్లో ఉన్నా.. అలాంటి ప్రాజెక్టేదీ ఇప్పటివరకూ ప్రకటనకు నోచుకోలేదు. ప్రణవ్ తరఫున తాను స్క్రిప్ట్స్ వింటున్నానని, కానీ ప్రస్తుతం ప్రణవ్ మాత్రం సినిమాపై అంతగా ఆసక్తిగా లేదని, తనకు నచ్చినదారిలో తాను వెళ్తున్నట్టు చెప్పుకొచ్చింది సుచిత్ర. 2022లో విడుదలైన హృదయం సినిమాతో అద్భుతమైన విజయాన్ని సాధించిన ప్రణవ్.. 2016లో ఒకసారి మాతృభూమి పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పిన మాటలు అతడి అంతరంగాన్ని బహిర్గతం చేసేవి. రీల్ లైఫ్‌లో జీవించాలనుకునేంతగా తనను ఇప్పటివరకూ ఏ స్క్రిప్టూ ఆకర్షించిన దాఖలాల్లేవంటూ ప్రణవ్ చెప్పిన మాటల్లోని ఫిలాసఫీ.. అతడు నటులను మించిన క్యారెక్టర్ అనేది మాత్రం పట్టిచూపించేది.

– రమణ కొంటికర్ల



# నవ్వులు కురిపించడమే కాదు..
# గుండెను మెలిపెట్టడమూ తెలుసు!

జంధ్యాల గారంటే కామెడీకి ట్రేడ్ మార్క్ అంటారు కానీ, తెలుగు సినిమాల్లో ఆయనలా సెంటిమెంట్ సీన్లు రాయగలిగిన మరో రచయిత కనిపించడు. నవ్వులు కురిపించడమే కాదు, గుండెను మెలిపెట్టడమూ తెలిసిన రచయిత ఆయన. నిజం! 'శంకరాభరణం', 'సాగరసంగమం', 'ఆపద్బాంధవుడు', 'అబ్బాయిగారు'.. చెప్తూ పోతే బోలెడు. 'అహ నా పెళ్లంట' లాంటి క్లాసిక్ కామెడీ ఫిల్మ్‌లో కూడా రాజేంద్రప్రసాద్, నూతన్‌ప్రసాద్‌ల మధ్య తండ్రీ కొడుకుల సెంటిమెంట్‌ను అద్భుతంగా పండించారు. 'ష్.. గప్‌చుప్' అని జంధ్యాల దర్శకత్వంలో వచ్చిన సినిమా. మల్లాది వెంకట కృష్ణమూర్తి అదే పేరుతో రాసిన నవల ఆధారంగా ఈ సినిమా తీశారు. కథ బాగుంటుంది కానీ తెర మీద చూసేంత గొప్పగా ఉండదు. కాబట్టి సినిమా పెద్దగా ఆడలేదు.

పైగా జంధ్యాల మార్క్ క్యారెక్టర్లు, కామెడీ కూడా మిస్సవడంతో అసలీ సినిమా ఆయన తీశారన్న విషయమే చాలామందికి తెలియకుండా పోయింది. సినిమాలో భానుప్రియ ప్రధాన పాత్ర పోషించగా, జంధ్యాల సినిమాల్లో రెగ్యులర్‌గా కనిపించే ఆర్టిస్టులంతా ఉన్నారు. సినిమాలో రవళి (భానుప్రియ) తండ్రిగా సుత్తి వేలు నటించారు. ఆయనకు మతిస్థిమితం సరిగా ఉండదు. పూర్తిగా పిచ్చివాడని కాదు, కానీ చిన్న పిల్లాడి చేష్టలు. సర్కస్‌లో చేరతానని, పనిమనిషిని ప్రేమిస్తానని అంటూ తిరుగుతుంటాడు. కూతురి కోసం పెళ్లిసంబంధం తెచ్చానంటూ రాత్రిపూట ఒకణ్ని పట్టుకొస్తాడు. అతనికి కాఫీ, టిఫిన్లు పెట్టి ఇంట్లోవాళ్లు మర్యాద చేస్తారు. అయితే వచ్చినవాడి వాలకం, అతని తీరు చూసిన భానుప్రియ అనుమానంతో ఆరాతీస్తుంది. అతనెవరో దారినపోయే దానయ్య అని, సుత్తివేలు అతనికో పాతిక రూపాయలిచ్చి పెళ్లిచూపులకు తీసుకొచ్చా డని తెలుస్తుంది. మొత్తానికి అతణ్ని గెంటేస్తారు. 'నీలా ఊళ్లో ఉన్న అందర్నీ ప్రేమించమంటావా నాన్నా?' అని భానుప్రియ కన్నీళ్లతో తండ్రిని అడిగి లోపలికి వెళ్లిపోతుంది. సీన్ అక్కడితో కట్ చేయొచ్చు. అలా చేస్తే జంధ్యాల ఎలా అవుతారు? పెరట్లో మంచం మీద పడుకొని ఏడుస్తున్న భానుప్రియ దగ్గరికి తండ్రి సుత్తివేలు వస్తాడు. అప్పుడు డైలాగులు చూడండి.

**సుత్తివేలు:** అమ్మా! చిన్నప్పుడు డబ్బుల్లేక ఏమీ కొనుక్కుతినలేకపోయాను. ఇప్పుడు లడ్డూలు, జాంగ్రీలు, ఐసులు, కాకినాడ కాజాలు.. అంటుంటేనే నోరూరిపోతోంది. ఇవన్నీ తినాలని కోరిక. కానీ నాకు షుగరుందని అవేవీ మీరు తిన్నివ్వరు. పోనీ తీపొద్దు, పంటి కిందికి ఏ కారప్పూసో, పకోడీనో పడేద్దామన్నా కూడా, వెర్రివాణ్ని కదమ్మా, నాకోసం ఎవ్వరూ ఏదీ చేసిపెట్టరు. జిహ్వా చాపల్యాన్ని చంపుకోలేక, పెళ్లిచూపులని చెబితే, పెళ్లివారికోసం అవన్నీ తెప్పించి పెడతారు, ఎంచక్కా తినేయొచ్చని ఈ పని చేశానమ్మా! ఊరికే, ఉత్తుత్తి పెళ్లిచూపులే గానీ, నిన్నా కళావర్ మొహంగాడికి ఇచ్చి పెళ్లి చేసేవాణ్ని కాదమ్మా! స్వీట్లు తిని, మితాయి కిళ్లీ వేసుకున్నాక, 'నువ్వు నాకు నచ్చలేదు పోరా సన్నాసిగా' అని చెప్పేసి కోప్పడి వాళ్లని గెంటేద్దామనుకున్నాను గానీ, నా బంగారుతల్లివి.. నిన్ను వాడిని అచ్చంగా నేనెందుకిచ్చేస్తానమ్మా? నిజం..మా అమ్మమీదొట్టు!

**భానుప్రియ:** పోన్లెండి నాన్నా! ఏదో జరిగిపోయింది. ఊరుకోండి! పసిపిల్లలకు ఎంత తినాలో, ఎప్పుడు ఆపాలో తెలీదు నాన్నా! మీరూ అంతే! ఎక్కువగా తినేస్తే మీ ఆరోగ్యం పాడవుతుందని అమ్మొద్దంటుంది కానీ, మీకు పెట్టడానికి మాకు బాధేమిటి చెప్పండి? ఇవాళ నేను ఉద్యోగం చేసి సంపాదిస్తున్నానంటే, ఇదంతా మీ వల్ల కాదు.. హు! తినరానివి తిని, రేపు మీ ఆరోగ్యం పాడై, జరగరానిది జరిగిందంటే, మేము దిక్కులేనివాళ్లం అయిపోతాం కద నాన్నా.. ఆ!

**సుత్తివేలు:** ఇప్పుడు నేనుండీ మీకేం చేస్తున్నానమ్మా?

**భానుప్రియ:** ఏమీ చేయక్కర్లేదు నాన్నా! మీరు మా వెనక కొండంత అండగా అలా నిలబడితే చాలు. మాకు పిడికెడు బలం, గుప్పెడు ధైర్యం వస్తాయి.

**సుత్తివేలు:** ఇప్పుడు నువ్వు నా కన్నీళ్లు తుడుస్తుంటే మా అమ్మ గుర్తొచ్చిందే అమ్మాయ్! నన్నెప్పుడూ ఏడవనిచ్చేది కాదు. చిన్నప్పుడూ మా అమ్మ ఒళ్లోనే పడుకునేవాణ్ని. ఇప్పుడు నీ ఒళ్లో పడుకోవచ్చా అమ్మా? ఆ..!

ఆ తర్వాత భానుప్రియ తన తండ్రిని ఒళ్లో పడుకోబెట్టుకుని నిద్రపుచ్చుతుంది.

జంధ్యాల గారు రాసిన అద్భుతమైన సన్నివేశాల్లో ఇదీ ఒకటి. ఈ సన్నివేశంలో కల్లాకపటం లేని అమాయకపు తండ్రిగా సుత్తివేలు, అతణ్ని అర్థం చేసుకునే కూతురిగా భానుప్రియ నటన మీరు చూసి తీరాలి. వాహ్!

ఇద్దరూ అత్యంత సహజంగా నటించారు. కామెడీకి కేరాఫ్ అనిపించుకున్న సుత్తివేలు గారు సెంటిమెంట్ పాత్రలు దొరికితే విజృంభిస్తారు. ఆయన చేసిన వైవిధ్యమైన పాత్రల్లో ఇదీ ఒకటి. సినిమా పెద్దగా ఆడకపోవడం వల్ల తెలియలేదు. నటించగలిగిన నటులకు సరైన పాత్రలు దొరకాలి. తగ్గ సన్నివేశాలు కుదరాలి. అప్పుడు కదా వాళ్ల ప్రతిభ తెలిసేది.

– విశీ (వి.సాయివంశీ)

## శ్రీదేవి చిన్న కూతురు బికినీ దుమారం

అతిలోక సుందరి శ్రీదేవి కుమార్తెల హవా ఆ లెవల్లో ఉంది. జాన్వీ కపూర్ ఇప్పటికే కథానాయికగా చెప్పుకోదగ్గ స్థాయికి ఎదిగేసింది. ఇంకా పెద్దస్టార్‌గా ఎదగాలనుకుంటోంది. మరోవైపు శ్రీదేవి రెండో కుమార్తె ఖుషీ కపూర్ తన అదృష్టాన్ని పరీక్షించుకునే పనిలో ఉంది. వరుసగా రెండు సినిమాల్లో నటిస్తోంది ఈ బ్యూటీ. అక్కాచెల్లెళ్ల గ్లామర్ ట్రీట్ గురించి బోయ్స్‌లో ఎక్కువగా చర్చ సాగుతోంది. దీనికి కారణం సోషల్ మీడియాల్లో ఈ భామలు షేర్ చేస్తున్న వరుస ఫోటోషూట్లు. బికినీలు, స్విమ్ సూట్ లు.. టాప్ లెస్ ఫోజులతో కపూర్ గాళ్స్ దుమ్ము లేపుతున్నారు. ముఖ్యంగా అక్క జాన్వీని మించి ఖుషీ కపూర్ ఇటీవల చెలరేగిపోతోంది. తాజాగా ఖుషీ తన స్నేహితులతో కలిసి బీచ్ వెకేషన్‌ని ఎంజాయ్ చేస్తున్న ఫోటోలు వీడియోలు ఇంటర్నెట్‌లోకి వచ్చాయి. ఈ ఫోటోగ్రాఫ్స్ లో ఖుషీ ఆరెంజ్ కలర్ బికినీలో టూ హాలిగా కనిపిస్తోంది. మరోవైపు స్నేహితులతో చిల్ చేయడంలోను ఖుషీ ఎక్కడా తగ్గడం లేదు. ప్రస్తుతం ఈ స్నేహితుల గుంపు రచ్చకు సంబంధించిన ఫోటోలతో పాటు ఖుషి స్పెషల్ బికినీ ఫోటోగ్రాఫ్స్ అంతర్జాలంలో వైరల్‌గా మారుతున్నాయి. సంధ్యా సమయాన ఖుషీ ఆరెంజ్ బికినీలో సముద్ర స్నానాలకు రెడీ అవుతోంది. అదే సమయంలో అందమైన నవ్వుతో కవ్విస్తోంది. ఖుషీ కపూర్ ది ఆర్చీస్ సిరీస్ తర్వాత పెద్ద తెర ఆరంగేట్రానికి రెడీ అవుతోంది. అమీర్ ఖాన్ కుమారుడితో ఓ సినిమా, సైఫ్ ఖాన్ కుమారుడితో ఓ సినిమా చేస్తోంది. కానీ ఈ చిత్రాలు ఇంకా విడుదలకు రావాల్సి ఉంది. నందమూరి నటవారసుడు మోక్షజ్ఞ సరసనా ఖుషి నటించే వీలుందని కథనాలొచ్చాయి. కానీ దీనికి అధికారిక సమాచారం లేదు. ఖుషీ కెరీర్‌ని షేపప్ చేసేందుకు బోనీకపూర్, జాన్వీ కపూర్ తమవంతు సహాయసహకారాలు అందిస్తున్నారు.


– తుపాకి.కామ్ సౌజన్యంతో...





అఖిల దేశాల గాడిదల సంఘాల సమైక్య సమాఖ్య- అ.దే.గా.సం.స.స. సమావేశం ఢిల్లీలో ఏర్పాటయింది. నానా జాతి గాడిదలయిన అడ్డగాడిదలు, కంచెర గాడిదలు, పిల్ల గాడిదలు, వృద్ధ గాడిదలు, పండిత గార్దభాలు, గాయక గార్దభాలు, నాయక గార్దభాలు, మూర్ఖగార్దభాలు.. అన్నీ ఒకసారి వెనుక కాళ్లతో కుర్చీలను తన్ని.. చెక్ చేసుకుని.. ఓండ్రపెట్టి సుఖాసీనులయ్యాయి. మీడియాను అనుమతించకూడదని గాడిదలు ముందే నిర్ణయం తీసుకున్నా గాడిద చాకిరీకి అలవాటుపడ్డ కొందరు మీడియా ప్రతినిధులు అలవాటులో పొరపాటుగా లోపలికి ప్రవేశించారు. అర్థం చేసుకున్న గాడిదలు అభ్యంతరం చెప్పలేదు.

# డాంకీ బిజినెస్!



రూ.100 కోట్లు.. 'గాడిద పాలు'

THE DONKEY PALACE

గాడిద పాల వ్యాపారం పేరిట 'ది డాంకీ ప్యాలస్' మోసం

- లీటర్ రూ.1,600 చొప్పున కొంటామని మాయమాటలు
- ఫ్రాంచైజీ కోసం లక్షలు ముట్టచెప్పామని బాధిత రైతుల గగ్గోలు
- ఐదు రాష్ట్రాల్లో 400 మంది బాధితులు
- ప్రభుత్వాలు న్యాయం చేయాలని వేడుకోలు

సాక్షి, హైదరాబాద్: 'గాడిద పాలకు విదేశాల్లో మంచి గిరాకీ ఉంది. గాడిదల ఫామ్ పెట్టుకుంటే మీ నుంచి లీటరు గాడిద పాలను రూ.1,600 చొప్పున మేమే కొంటాం. మంచి లాభాలు ఆర్జించవచ్చు'అని నమ్మించి ది డాంకీ ప్యాలస్ సంస్థ ప్రతినిధులు తమను మోసం చేశారని ఏపీలోని గుంటూరు జిల్లాకు చెందిన సాయిబాబు, మరికొంత మంది బాధితులు ఆరోపించారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాధితులు తమ గోడును వెళ్లబోసుకున్నారు. తమిళనాడు రాష్ట్రం తిరునల్వేలి జిల్లా ముక్కడల్ గ్రామంలో 'డాంకీ ప్యాలస్'అనే సంస్థ ఉంది. వీళ్లు గాడిదలు, గాడిద పాల వ్యాపారం చేస్తారు. గాడిద పాలతో లాభాలు ఆర్జించవచ్చని యూట్యూబ్‌లో బాగా ప్రచారం చేశారు. దీనికి ఆకర్షితులైన

మిగతా 7వ పేజీలో ▶

Courtesy: Sakshi






**'గాడిద వార్తలు' అన్న సమాసానికి-**

గాడిదలకు సంబంధించిన వార్తలు అన్న అర్థం ఒక్కటే కాకుండా ఇతరేతర అర్థాలు కూడా మనుగడలో ఉండడం వల్ల అలాంటి సమాసాన్ని వాడవద్దని ఇతరులను గౌరవించే సదుద్దేశంతో పండిత గార్దభాలు ముందే విన్నవించుకున్నాయి.

ప్రార్థన అని యాంకర్ గాడిద మైక్‌లో అనౌన్స్ చేయగానే ఒక్కసారిగా సభ గార్దభ తీవ్ర శ్రుతి ఓండ్రతో దద్దరిల్లింది. అధ్యక్ష గార్దభం నేరుగా మైక్ అందుకుని దిక్కులు పిక్కటిల్లేలా మాట్లాడుతోంది. బ్రీత్ లెస్ శైలిలో సాగిన గాడిద గంట ఉపన్యాసం యథాతథంగా ఇవ్వడం కుదరక మీడియా సారాన్ని మాత్రమే రిపోర్ట్ చేసింది. మీడియాలో వచ్చిన గాడిద సంఘాల సమైక్య సమాఖ్య వార్తల సారమిది.

'కృత, త్రేతా, ద్వాపర – మూడు యుగాలు ముగిసి.. కలియుగం మొదటి పాదంలో ఉన్నా.. ఇన్ని యుగాల్లో గాడిదలకు సముచిత స్థానం కల్పించాలని అడిగినవారు, గాడిదల మనోభావాలను గుర్తించినవారు లేరు. తొలిసారి ఇందిరాగాంధీ కోడలు, పర్యావరణ ప్రేమికురాలు, రాజకీయ నాయకురాలు మేనకా గాంధీ గాడిదలకు అత్యున్నత స్థానం కల్పించారు. అందుకు మా జాతి ఈ భూమ్మీద ఉన్నంత వరకు ఆమెకు రుణపడి ఉంటాము.

ఆనాటి క్లియో పాత్రా రోజూ పాత్రల కొద్దీ మా పాలతో రుద్దుకోవడం.. స్నానం చేయడం వల్లే అందగించిందన్న చారిత్రక సత్యాన్ని మేనకా గాంధీ బహిరంగ సభల్లో బహిరంగంగా మైకు గుద్ది చెప్పడం మాకొక నోబెల్ బహుమతి లాంటిది.

భారతదేశంలో గాడిద పాలు తాగడం వల్ల ఆరోగ్య పరిరక్షణ, గాడిద పాలతో తయారుచేసిన సబ్బుతో రుద్దుకుంటే నిగనిగలాడే చర్మ సౌందర్యం గురించి ఆమె చెబుతుంటే అడ్డ గాడిదలమైన మాకే బుగ్గల్లో సిగ్గుల మొగ్గలు మొగ్గ తొడిగాయి.

అనాదిగా నిర్లక్ష్యానికి, అవహేళనకు, అవమానాలకు గురైన మా గార్దభ ఆత్మ సౌందర్య గౌరవాన్ని మేనక తట్టి లేపారు.

బొగ్గుపాల కడుగ పోవునా మలినంబు? అని వేమన ఆనాడే ప్రశ్నించాడు. ఇప్పుడు ఆ వేమనే ఉండి ఉంటే 'గాడిదపాల కడుగ పోవును మలినంబు వచ్చును అందంబు' అని కచ్చితంగా కొత్త ఆటవెలది రాసి.. పాడేవాడు.

సందర్భం వచ్చింది కాబట్టి.. సామెతల విషయం కూడా ఒక మాటనుకోవాలి. తెలుగు సామెతలు, నుడికారాలు, జాతీయాలు, వాడుక మాటలు మా మనోభావాలను బాగా దెబ్బ తీస్తున్నాయి.

'వసుదేవుడంతటివాడు గాడిద కాళ్లు పట్టుకొన్నాడట', 'కూసే గాడిద వచ్చి మేసే గాడిదని చెడగొట్టిందట', 'గాడిద గుడ్డు కాదూ..!', 'అడ్డ గాడిదలా పెరిగావు.. ఎందుకూ కొరగావు', 'గాడిదలా బరువులు మోయడం', 'గాడిద చాకిరీ', 'గుర్రం గుర్రమే– గాడిద గాడిదే', 'పిల్ల గాడిద ముద్దు– పెద్ద గాడిద మొద్దు'.. సృష్టిలో అన్ని ప్రాణులకు బతికే హక్కును భగవంతుడు ఇచ్చాడు. అలాగే మా ఆత్మ గౌరవాన్ని కాపాడుకునే హక్కు కూడా మాకు ఉంటుందని సవినయంగా తెలియజేసుకుంటున్నాం. విన్నారా సరి! లేకపోతే.. చట్టం తన పని తాను చేసుకుపోతున్నట్లే.. మా వెనుక కాళ్లు వాటి పని అవి చేసుకుపోతాయి!

కాబట్టి ఈ సభ ముక్త కంఠంతో.. 'గాడిదలకేమి తెలుసు గంధపు చెక్కల వాసన?' అన్న నానుడిని నిరాకరిస్తూ.. 'గాడిదలకే తెలుసు గంధపు చెక్కల వాసన', 'గాడిదలకే తెలుసు అందపు చెక్కిళ్ల నునుపు', 'గాడిదలు చెక్కిన శిల్పం', 'గార్దభ క్షీర సౌందర్య న్యాయం'.. లాంటి కొత్త పాజిటివ్ మాటలనే వాడాలని తోటి ప్రాణి కోటిని డిమాండు చేస్తోంది.

సభ ఒక్కసారిగా గాడిదల ఓండ్ర హర్ష ధ్వానాలతో మారుమోగింది!

అన్నట్లు..

గాడిదపాలు కొనుక్కుంటాం.. అంతర్జాతీయంగా గాడిదపాలకు విపరీతమైన డిమాండు అంటూ ఒక్కో గాడిదను లక్షన్నరకు పైగా అమ్మి.. రెండు మూడు నెలలు అన్నట్లుగానే గాడిదపాలు కొని.. తర్వాత అదృశ్యమయ్యింది డాంకీ ప్యాలెస్ సంస్థ. దక్షిణ భారతదేశంలోని అన్ని రాష్ట్రాల్లో ఈ సంస్థ మోసానికి గురైనవారు వేలల్లో ఉన్నారు.

ఇప్పటికి ఇది 110 కోట్ల కుంభకోణమని తేలింది. సాధారణంగా 15వేల నుంచి అత్యధికంగా 40వేల వరకు ధర పలికే గాడిదలను స్థానిక మార్కెట్లోనే కొని.. లక్షన్నర నుంచి రెండు లక్షల వరకు అక్కడే అమ్మిన ఈ డాంకీ ప్యాలెస్ మార్కెటింగ్ మెలకువలో గాడిదలైనవారెవరో గాడిదలు చెప్పలేకపోవచ్చు కానీ.. గాడిదలకు తెలుసు! మొత్తం డాంకీ స్కామ్‌లో పెట్టుబడి ఎంత? లాభమెంత? ఇన్ని జంతు వులుండగా వీరు గాడిదలనే ఎంచుకోవడానికి గల కారణాలేమిటి? సమాజంలో ఎవరినైనా గాడిదలను చేయవచ్చని వీరు అనతి కాలంలోనే ఎలా పసిగట్టగలిగారు? ఇంట్లో, పెరట్లో కట్టిన డాంకీ ప్యాలెస్ అత్యుత్తమ గాడిదలను ఇప్పుడేమి చేయాలి? గాడిదపాలతో ఏయే పదార్థాలు చేసుకోవాలి? ఇంత ఇన్నోవేటివ్ ఐడియా చిన్న స్టార్టప్ అవుతుందా? భారీ పరిశ్రమ అవుతుందా? దీన్ని ఫిన్ టెక్ కంపెనీ అనాలా? లైవ్ స్టాక్ బిజినెస్ అనాలా?

1. అడాప్టేషన్స్ ఆఫ్ సక్సెస్‌ఫుల్ స్ట్రాటజీస్ ఫ్రం ఇండస్ట్రీ.
2. ఇంపోర్టింగ్ స్ట్రాటజీస్ ఫ్రం అదర్ ఇండస్ట్రీస్
3. కంబైనింగ్ స్ట్రాటజీస్ ఫ్రం మల్టిపుల్ డిఫరెంట్ ఇండస్ట్రీస్
4. స్ట్రాటజీస్ క్రియేటెడ్ ఫ్రం స్క్రాచ్

.. అని సకల ఇండస్ట్రీ బిజినెస్ స్ట్రాటజీలు ఈ నాలుగు కేటగిరీల్లోనే ఉంటాయని సంప్రదాయ ఎంబిఏ పాఠాల్లో చెబుతారు. ఈ డాంకీ బిజినెస్ ప్రాఫిట్ అండ్ లాస్ అనలిటిక్స్‌ను చూసిన తర్వాత ఇది ఏ స్ట్రాటజీ కిందికి వస్తుందో! లేక అయిదో స్ట్రాటజీగా కొత్తగా చేరిస్తే ఎలా ఉంటుందో! స్టాన్ఫోర్డ్‌లు, హార్వర్డ్‌లు, ఐఐఎంలు, ఐఎస్‌బిలు అర్జెంటుగా ఆలోచించకపోతే నష్టపోయేది ఆ కాలేజీలే.. గాడిదలు కాదు! గాడిదల్లా కళ్లకు గంతలు కట్టుకుని నాలుగ్గోడల మధ్య క్లాసు రూముల్లో కూర్చుని ఏమి చదువుతారు? కొంచెం ఇలా బయటికి వచ్చి కళ్లు తెరిచి విశాల గార్దభ ప్రపంచంలో చదువుకోండి! అడ్డగాడి దలు కూడా లెక్కలే నన్ని జీవనవ్యాపార విజయ రహస్య పాఠాలు చెబుతాయి! ఇట్స్ ఎ ఫుల్ ఆఫ్ ఫూల్స్ ప్యారడైజ్! ఇట్స్ ఎ ప్రామిసింగ్ 'డాంకీ ప్యారడైజ్' బిజినెస్!! నేర్చుకుంటే ప్రతిదీ పాఠమే! నేర్చుకోకుంటే ప్రతిదీ గుణపాఠమే!!

**– పమిడికాల్వ మధుసూదన్**



పాల లాభం.. గాడిద గుడ్డు

Courtesy: Andhra Jyothi

గాడిదలను అంటగట్టి రూ.100కోట్లకు కుచ్చుటోపీ.. లీటరు పాలు 1600కు కొంటామని ఆశపెట్టిన వైనం

- రూ.కోటి పెట్టుబడి పెట్టిన బాధితులు
- చేతులెత్తేసిన 'ద డాంకీ ప్యాలెస్'
- న్యాయం చేయాలంటూ వేడుకోలు

# టీచర్లపై అప్రకటిత ఎమర్జెన్సీ!

## పాఠశాలల పనివేళలు గంట పెంపు!

» నెల్లూరు జిల్లాలో పైలెట్‌గా కొత్త టైమ్‌టేబుల్

అమరావతి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పాఠశాలల పనివేళలు పెంచేందుకు పాఠశాల విద్యాశాఖ చర్యలు ప్రారంభించింది. ఇందులో భాగంగా కొత్త టైమ్‌టేబుల్‌ను నెల్లూరు జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా అమలు చేయాలని నిర్ణయించింది. తాజాగా ఆ జిల్లా డీఈవో దీనిపై ఉత్తర్వులు జారీచేశారు. ప్రతి మండలంలో ఒక ఉన్నత పాఠశాల లేదా హైస్కూల్ ప్లస్‌ను ఎంపిక చేసి ఈ నెల 25 నుంచి 30 వరకు కొత్త టైమ్‌టేబుల్ అమలుచేయాలని పేర్కొన్నారు. దానిపై వచ్చే అభిప్రాయాలతో నివేదికలు సమర్పించాలన్నారు. ఆ నివేదికల ఆధారంగా రాష్ట్రవ్యాప్త అమలుపై నిర్ణయం తీసుకుంటారు. ప్రస్తుత పాఠశాలల పనివేళలు ఉదయం 9 నుంచి సాయంత్ర 4 గంటలు కాగా..కొత్త టైమ్‌టేబుల్ ప్రకారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకు పనిచేస్తాయి. ఉదయం, మధ్యాహ్నం ఇచ్చే బ్రేక్‌ల సమయం 5 నిమిషాల చొప్పున, భోజన విరామం 15 నిమిషాలు పెంచారు. ఉదయం మొదటి పీరియడ్ 5 నిమిషాలు పెంచి 50 నిమిషాలు చేశారు. ఆ తర్వాత 3 పీరియడ్లు ప్రస్తుతం 40 నిమిషాల చొప్పున ఉండగా వాటిని 45 నిమిషాలకు పెంచారు. మధ్యాహ్నం మొదటి పీరియడ్‌ను మార్చకుండా అనంతరం 3 పీరియడ్లు 45 నిమిషాలకు పెంచారు. ఈ మార్పుల కారణంగా రోజులో బడి సమయం గంట పెరుగనుంది. అయితే కొత్త పనివేళలపై ఉపాధ్యాయ సంఘాలు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నాయి. ఏపీ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) అధ్యక్షుడు ఎస్.బాలాజీ, ఏపీటీఎఫ్-అమరావతి అధ్యక్షుడు సీవీ ప్రసాద్ ప్రస్తుత పనివేళలనే కొనసాగించాలని డిమాండ్ చేశారు.

విద్యాశాఖలో భళారే విచిత్రం అంటూ వాట్సప్ గ్రూప్‌లలో ఉపాధ్యాయులు చర్చలే చర్చలు. ప్రవీణ్ ప్రకాష్ లాంటి వ్యక్తి విద్యా శాఖ నుంచి నిష్క్రమిస్తే ప్రభుత్వ పాఠశాలలు బతికి బట్టకడతాయని, ఉపాధ్యాయులు కొన్ని నిమిషాల పాటైనా ఆక్సిజన్ పీల్చుకోవచ్చని అందరూ భావించారు. పాఠశాలల్లో విద్యాబోధన మూడు పూవులు ఆరు కాయలుగా విరాజిల్లుతుందని భావించారు. అధికారుల మితిమీరిన జోక్యం వల్ల మరుగున పడిన బోధనను తిరిగి కొనసాగించవచ్చని ఉపాధ్యాయ లోకం కళ్లకు వత్తులు వేసుకుని చూసింది. ఐదు నెలల కిందట రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరాక అందరూ ఆ దిశగా ఆశపడ్డారు. అయితే పేరుకు ప్రవీణ్ ప్రకాష్ వెళ్లిపోయారు కానీ ఆయన నాటిన విత్తనాలు ఇపుడు మొలకెత్తాయి. ఉపాధ్యాయులను వేపుకుతినే కార్యక్రమాన్ని నిరాఘాటంగా కొనసాగించడానికి వారు ఉద్యుక్తులవుతున్నారు. గత ప్రభుత్వంలో పురుడుపోసుకున్న యాపులకు తోడు మరిన్ని టపాలు రావడం, పాఠశాలల్లో ఉపాధ్యాయుల సమయపాలనకు కొత్త నిబంధనలు తీసుకురావడం, ఉపాధ్యాయులకు చట్టబద్ధంగా సంక్రమించిన క్యాజువల్ లీవుల మంజూరులో నిబంధనలు సృష్టించడం, హైస్కూల్ ప్లస్ స్కూళ్ల పని గంటలను హెచ్చించడం, రెసిడెన్షియల్ శిక్షణ, వీటన్నిటికీ తోడు పైలట్ ప్రాజెక్టు కింద పాఠశాల సమయాన్ని సాయంత్రం 5 గంటల దాకా హెచ్చించటం వంటి తిరోగమన విధానాలు అమలుచేయబోతున్నారు. ఈ నేపథ్యంలో దేశంలోని వివిధ రాష్ట్రాల్లో పాఠశాలల పని వేళల్ని పరిశీలిద్దాం!

### పాఠశాల పనివేళల పెంపు

ప్రత్యేకించి దక్షణాది రాష్ట్రాల్లోనే కాకుండా అక్షరాస్యతలో దేశంలోనే అగ్రస్థానంలో ఉన్న కేరళలో ఉదయం 9.10 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు, కొన్ని పాఠశాలలు 10 నుంచి 4 గంటల వరకు, ఉన్నత పాఠశాలల్లో 7.30 నుంచి 1.30 వరకు నిర్వహిస్తారు. విరామ సమయం తీసేస్తే అన్ని పాఠశా లల గరిష్ట పని వేళలు ఐదు గంటలు మాత్రమే! తెలం గాణలో ఉదయం 9 నుంచి 4.15 వరకు నిర్వహిస్తున్నారు. అలాగే తమిళనాడులో ఉదయం 9 గంటల నుంచి సాయం త్రం 4.10 వరకు నిర్వహిస్తారు. విద్యార్థుల్లో గ్లానీ ఏర్పడకుండా 5 పీరియడ్లకు పరిమితం చేసారు. అంతేకాకుండా ప్రతి పీరియడ్‌కు మధ్య 10 నిమిషాల విరామం ఇచ్చారు. కర్ణాటకలో 8 నుంచి 1.30 వరకు, పాఠశాలలు నిర్వహిస్తారు. ఉత్తరాది రాష్ట్రాల్లో అతి పెద్ద రాష్ట్రం ఉత్తరప్రదేశ్‌లో 9.30 నుంచి 3.30 వరకు నిర్వహిస్తున్నారు. అత్యంత నాణ్యతా ప్రమాణాలతో విద్యాబోధన నిర్వహిస్తున్న ఢిల్లీలో కూడా ఇటువంటి విపరీత ధోరణులు లేవు. ఉపాధ్యాయులను మానసికంగా ఎలా చిందరవందర చేయాలా అనే అత్యుత్సాహం తప్ప బోధనలో నాణ్యతా ప్రమాణాలు ఎలా ప్రోది చేయాలా అనే లక్ష్యాల కనుచూపు మేరలో కనిపించడం లేదు. పూర్తిస్థాయిలో ఉపాధ్యాయ నియామకాలు జరిపి పని వత్తిడి తగ్గించడమెలాగనే తార్కిక పునర్విమర్శకు బదులు గొడ్డుచాకిరిని ఎలా చేయించాలనే విధ్వంస పథక రచన జరుగుతోంది. ఆంధ్రప్రదేశ్‌లో పని వేళలు పెంచడానికి పైలట్ ప్రాజెక్టు చేపట్టడంలోని ఔచిత్యమేమిటి? ఇదొక భేతాళ ప్రశ్న! మానవ మేధస్సును చిదిమేసే ప్రక్రియ అది. పనివేళల హెచ్చింపు అనివార్యమని ప్రభుత్వం భావిస్తే తద్వారా సాధించదలచుకున్న లక్ష్యాలను చదువు చెప్పే ఉపాధ్యాయులకు ముమ్మందు తెలియజెప్పాలి. అలా కాకుండా ఒక రహస్య అజెండాతో ముందుకెళ్లడం ఏమాత్రం శ్రేయస్కరం కాదు. పాఠశాల పని వేళలు ఎలా ఉండాలనేది విద్యార్థుల్లో అభ్యసన సంసిద్ధత, మానసిక పరిపక్వత, స్థానిక పరిస్థితులు, రవాణా సౌకర్యాలు, ప్రజల జీవన విధానం వంటి అనేక అంశాలు ప్రతిక్షేపిస్తాయి. 70 శాతానికి పైబడి గ్రామీణ ప్రాంత విద్యార్థులను ప్రామాణికంగా తీసుకొని ప్రయోగాలు చేయాలి తప్ప అన్ని వసతులు కలిగిన పట్టణ ప్రాంతాలను బేరీజు వేయకూడదు. ఇప్పటికే ఆంగ్ల మాధ్యమ ప్రభావంతో తీవ్ర మానసిక వత్తిడి వల్ల విజ్ఞానం సన్నగిల్లి వస్తున్న అత్తెసరు ఫలితాలకు విరుగుడు కనుక్కోవాలి. పరిశోధన, విశ్లేషణ ఉత్తమ ఫలితాలకు మార్గం సుగమం చేస్తాయి తప్ప ఉపాధ్యాయులను చాకిరేవులో ఏకి పారేస్తే సాధ్యం కాదు. ఏడున్నర దశాబ్దాల కాలంలో ఇలాంటి విపత్కర పరిస్థితిని విద్యారంగం చవి చూడలేదు. ఇదొక అప్రకటిత ఎమర్జెన్సీ. ఉపాధ్యాయులపై ముప్పేట దాడి. అనుకూలమైన బోధనా సమయాన్ని యాప్‌ల నిర్వహణకు, ట్రైనింగ్‌లకు కుదువ బెట్టి విద్యా బోధనను కుంగదీసే వ్యవహారానికి మంగళం పాడాల్సిన అవసరం ఉంది. మీదు మిక్కిలి ఉపాధ్యాయులు తమ వ్యక్తిగత అవసరాలకు సెలవు తీసుకునే అవకాశాన్ని కూడా అధికారుల చెప్పుచేతల్లోకి తీసుకొంటున్నారు. ఉపాధ్యాయుడు కూడా ఒక సంఘజీవి. వారికి భౌతిక అవసరాలుంటాయి. వారిలో కూడా చీమూ నెత్తురు ప్రవహిస్తుంటుంది. వారికి కుటుంబాలుంటాయి. వారి కుటుంబ సభ్యుల ఆరోగ్య అవసరాల కోసం, జ్వరమో, తలనొప్పి వచ్చినా సెలవు వచ్చినా సెలవు పెట్టుకోవడానికి అధికారుల కాళ్లు మొక్కాల్సిన పరిస్థితి కల్పిస్తున్నారు. ఇటీవల జరిగిన సమావేశంలో పాఠశాల లేదా మండలం యూనిట్‌గా తీసుకున్నపుడు 10 శాతానికి మించి సెలవు మంజూరుచేయవద్దని ఆదేశించారు. మెడ మీద తల ఉండేవారు చెబుతారా ఇలా. ఉన్నత స్థానాల్లో ఉన్నవారు చట్టంతో పాటు మానవీయకోణంలోనూ ఆలోచించాలి. భౌతిక అవసరాలు ఎవరికీ చెప్పి రావు. అందు కోసమే ఆకస్మిక సెలవు (క్యాజువల్ లీవ్). అలాగని ఉపాధ్యాయులు బాధ్యతారహితంగా పాఠశాలలకు ఎగనామం పెట్టరు కదా! మరి సెలవు హక్కు కాదనడం ఏంటి? ఉపాధ్యాయులకు కనీస మానవ హక్కులు కూడా వర్తించకుండా ప్రతిబంధకాలు సృష్టించడమేంటి? వ్యవస్థలను బలోపేతం చేసే సంస్కరణలను స్వాగతించాల్సిందే! కానీ అవి మొదటికి మోసం తెచ్చేవి కాకూడదు. అసంబద్ధ విధానాలకు స్వస్తి పలికి ఆచరణాత్మక, తులనాత్మక శాస్త్రీయ విధానాల బాటలో ముందు కెళ్లడం సర్వత్రా శిరోధార్యం! **– సోర్స్: వాట్సప్ కథనం**

ఎం.ఇర్షాద్
USHA ఆథరైజ్డ్ డీలర్స్
షాప్: 08942-229343
సెల్: 95731 43409
ఎ.కె. ఎంటర్‌ప్రైజెస్
ఉషా సెవింగ్ మిషన్స్, ఆఫీస్ ఫర్నిచర్..
అన్ని రకాల సెవింగ్ మిషిన్లు, ఫేషన్ మేకర్స్, ఎంబ్రాయిడరీ మిషిన్లు, స్పేర్స్ హోల్‌సేల్
రాజా కాంప్లెక్స్, కరెంట్ ఆఫీసు ఎదురుగా, జి.టి. రోడ్డు, శ్రీకాకుళం - 532 001

మెట్రో సోఫా వర్క్స్
అన్ని రకముల సోఫాలు, ఫర్నిచర్ మేనుఫేక్చర్స్ (హోల్‌సేల్ & రిటైల్)
షాపు నెంబరు 1, కొన్నవీధి, వన్‌వే ట్రాఫిక్ రోడ్డు, మాధవ మోటార్స్ దరి, శ్రీకాకుళం
సెల్: 83094 81129

SSJ
శ్రీ స్వర్ణ జ్యూయలరీ
ప్రొ॥ వాళ్ళ కిరణ్‌కుమార్
99636 89666, 90009 07133
జి.టి. రోడ్డు, శ్రీకాకుళం
E-mail: sriswarnajewelleries@gmail.com

SAI OPTICIANS
సరస్వతి మహల్ ఎదురుగా, శ్రీకాకుళం
ప్రొప్రయిటర్: బి.రమణమూర్తి
సెల్: 94407 59739
బ్రాంచ్ ఆఫీస్: గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజ్ రోడ్డు, శ్రీకాకుళం, సెల్: 94407 59739

Siva Srinivasa
Sofa Emporium
Lade Chandra Sekhar Rao
Ph. No: 94401 21710
63053 35395, sekharlifestyle99@gmail.com
NEAR SURYA MAHAL THEATRE WOMEN'S COLLEGE ROAD, SRIKAKULAM - 532 001

## వైకాపా కాంట్రాక్టర్లకే ఇక్కడ ఇసుక ఫ్రీ

(మొదటిపేజీ తరువాయి)

వచ్చింది. దీంతో పని కావడంలేదని ఒక డివైజ్‌ను ఇసుక కోసం మార్కెట్‌లోకి తెస్తే, దానికి డూప్లికేట్ డివైజ్ తయారు చేసి, ఆమదాలవలస నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున ఇసుక పట్టుకుపోయారు. జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన మొదట్లో అక్రమార్కుల మీద ఉక్కుపాదం మోపుతారని ప్రచారం జరగడంతో శ్రీకాకుళం జిల్లా కేంద్రానికి దగ్గర్లో ఉన్న తోటాడ, సింగూరు ర్యాంపులకు చెందిన సూత్రధారులు కొన్నాళ్లు పరారైపోయి, తర్వాత ప్రత్యక్షమయ్యారు. ఆ సమయంలో ఇక్కడ ఇసుక తరలించినదంతా హోతా వెంకటేష్ ప్రాపర్టీసేనని ప్రచారంలో ఉంది. ఇప్పుడు అదే సంస్థకు తెలుగుదేశం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా రెండు కీలకమైన ర్యాంపులు కట్టబెట్టడం వెనుక ఏం జరిగివుంటుందో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. గతంలో ఇసుకను అక్రమంగా తరలించిన అనుభవం ఉన్నవారికి మాత్రమే ఈసారి ర్యాంపులు వచ్చాయి. గత ప్రభుత్వం నేరుగా ఇసుక వ్యాపారం చేసినా, దానికి సమాంతరంగా తాము ఇసుకను తోలుకుపోయేవారమన్న క్వాలిఫికేషన్‌తోనే ఇటువంటి సంస్థలన్నీ ఇప్పటి తెలుగుదేశం నాయకులను కలిసి గతంలో వైకాపా నేతలకు ఎలా తినిపించారో, ఇప్పుడు ఎలా వడ్డించబోతున్నారో చెప్పడంతో గత ప్రభుత్వ హయాంలో ఇసుకను తోడినవారే ఇప్పుడు అదే పనిలో ఉన్నారు. హయాతినగరం శ్రీకాకుళం నగర పరిధిలోకి వస్తుంది. తోటపాలెం ఎచ్చెర్ల పరిధిలోకి వస్తుంది. రెండూ నడి ఒడ్డునే ఉన్నా నాగావళికి వరద వస్తే హయాతినగరం మునగదు. తోటపాలెంలో పంటలు మాత్రం కోతకు గురవుతాయి. అందుకే అటువైపు ర్యాంపు ఇవ్వరు. కానీ ఇప్పుడు అక్కడి టీడీపీ నాయకులను ముందుకు పెట్టి తోటపాలెం నుంచి లారీలు యథేచ్ఛగా వెళ్లడానికి బాటలు వేస్తుండటంపై ఇప్పటికే మైన్స్ డీడీకి ఫిర్యాదువెళ్లింది. ఏంజరుగుతుందో చూద్దాం.

## బాధ్యతలు చేపట్టిన పోలీసు అధికారులు



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

శ్రీకాకుళం జిల్లా పోలీసు శాఖ అదనపు ఎస్పీ (అడ్మిన్)గా కెవి రమణ సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయన ఛాంబర్‌లో బాధ్యతలు చేపట్టారు. రాష్ట్ర పోలీసు ప్రధాన కార్యాలయం నుంచి సాధారణ బదిలీల్లో భాగంగా జిల్లా అదనపు ఎస్పీగా బదిలీపై వచ్చారు. అలాగే జిల్లా స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీగా జి.సీతారామారావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్)గా స్వీకరించిన కేవీ రమణ, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ జి.సీతారామారావు ఇరువురు బాధ్యతలు చేపట్టిన అనంతరం ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డిని జిల్లా పోలీస్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కలను అందజేశారు. జిల్లా పోలీసు కార్యాలయ పనితీరును పర్యవేక్షించాలని, కార్యాచరణతో ఎటువంటి కాలయాపన లేకుండా పోలీస్ సిబ్బందికి సంబంధించి పెండింగ్ ఫైళ్లను వేగంగా పరిష్కరించాలని ఎస్పీ తెలిపారు. అదనపు ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన రమణను పలువురు పోలీసు అధికారులు, జిల్లా పోలీసు కార్యాలయ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలను, పూలమొక్కలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు

## సమస్య పరిష్కరించకపోతే పోరాటం ఉధృతం

### - మున్సిపల్ కార్మికుల అర్ధనగ్న నిరసన

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అనుబంధ సంఘ ఆధ్వర్యంలో శానిటరీ మేస్త్రులను విధుల్లోకి తీసుకోవాలని, లేకపోతే పోరాటం ఉధృతం చేస్తామని మున్సిపల్ యూనియన్ గౌరవాధ్యక్షుడు టి.తిరుపతిరావు, ప్రధాన కార్యదర్శి కళ్యాణి అప్పలరాజు, అధ్యక్షుడు కె.వేణుగోపాలరావు మున్సిపల్ అధికార యంత్రాంగాన్ని హెచ్చరించారు. మున్సిపల్ శానిటరీ మేస్త్రీలు, పారిశుధ్య కార్మికులు ఆరు రోజులుగా సమ్మెలో ఉన్నా, ఊరు, వాడ దుర్వాసన కొడుతున్నా ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని, కార్మికుల సమస్యల పరిష్కారం చేసి విధుల్లో పంపించకుండా మున్సిపల్ కమిషనర్, హెల్తాఫీసర్ తాత్సారం చేస్తున్నారని విమర్శించారు. సోమవారం నగర పాలక సంస్థ కార్యాలయం వద్ద అర్ధనగ్నంగా ఆందోళనలు చేశారు. ఈ కార్యక్రమంలో మేస్త్రుల సంఘం నుంచి అధ్యక్షుడు ముద్దాడ రామారావు, అల్లు రవి, టి.షణ్ముఖరావు, మున్సిపల్ యూనియన్ నాయకులు జె.గురుమూర్తి, ఎన్.పార్థసారథి, ఆర్.గణేష్, అర్జి పెద్ద మనేద్ర, తారక, డి.రమణ, రసూల్, తారక, సోగ్గాడు, అర్జి గణేష్, కె.తిరుమలరావు, సీతమ్మ, అర్జీ లక్ష్మి, సరస్వతి సోషల్ మీడియా ప్రతినిధి అరుగుల రమణ తదితరులు పాల్గొన్నారు.




## డీఎస్సీలో సమగ్ర శిక్ష సిబ్బందికి వెయిటేజ్ ఇవ్వాలి

### - కలెక్టర్‌కు ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం వినతి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

సమగ్రశిక్ష పథకం కింద పనిచేస్తున్న సీఆర్‌ఎంటీ ఎంఐఎస్, కో-ఆర్డినేటర్లు, సీఆర్పీలకు మెగా డీఎస్సీలో వెయిటేజీ మార్కులు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కొత్తకోట రామమూర్తి, బోనెల రమేష్, జిల్లా అధ్యక్షుడు వడమ శరత్‌లు కలెక్టర్‌ను కోరారు. ఈమేరకు సోమవారం కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. 2019 డీఎస్సీలోను వెయిటేజ్ మార్క్ ఇచ్చారని, కానీ ఉన్నత విద్యార్హతలతో బీఈడీలు ఉన్న సీఆర్‌ఎంటీ, ఎంఐఎస్ కోఆర్డినేటర్, సీఆర్టీలకు వెయిటేజ్ ఇవ్వలేదని, ప్రభుత్వం, అధికారులు సానుకూలంగా స్పందించి న్యాయం చేయాలని ఆంధ్రప్రదేశ్ ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం విజ్ఞప్తి చేసింది.



## అగ్నిబాధిత కుటుంబాలకు చేయూత



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

అరసవిల్లి కాపువీధిలో అగ్ని ప్రమాద బాధితులకు రెడ్ క్రాస్ సహాయ సామగ్రి అయిన కిచెన్ సెట్లు, టార్పాలిన్ షీట్స్, దోమ తెరలు, చీరలు, తువ్వాళ్లు, ఉన్ని దుప్పట్లు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ శ్రీకాకుళం జిల్లా శాఖ అందించింది. ఈ కార్యక్రమంలోని రెడ్‌క్రాస్ సెక్రెటరీ బలివాడ మల్లేశ్వరరావు, ఎంసీ మెంబర్ బి.చిన్మయిరావు, ఉంగటి రమణ, వీఆర్వో లీలప్రసన్న, గొలివి రమణ, రెడ్‌క్రాస్ ప్రోగ్రామ్ మేనేజర్ ఉమాశంకర్, వెంకటరమణ, గోపి, గ్రామపెద్దలు పాల్గొనడం జరిగింది.

## విశాఖ ఉక్కు రక్షణకు ఉద్యమం ఉధృతం




(సత్యంన్యూస్, పలాస)

ఉత్తరాంధ్రకు తలమానికమైన విశాఖ ఉక్కును ప్రైవేటీకరించాలని కేంద్రం ప్రతిపాదించడం, దానికి రాష్ట్రంలోని నాటి అధికార పార్టీ వైకాపా, నేటి అధికార కూటమి వత్తాసు పలకడం ఉత్తరాంధ్ర ప్రజలను మోసం చేయడమేనని ఉత్తరాంధ్ర ప్రజా సంస్థ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు చౌదరి లక్ష్మణరావు దుయ్యబట్టారు. కేంద్రంలోని ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ ఆధ్వర్యంలోని ఇండియా కూటమి నేతలు ప్రైవేటీకరణ యత్నాలను అన్ని పార్టీలు, సంఘాల మద్దతుతో అడ్డుకునే యత్నం చేయడం లేదని విమర్శించారు. సోమవారం ఉత్తరాంధ్ర ప్రజా సంస్థ ఆధ్వర్యంలో పలు ప్రజా సంఘాల మద్దతుతో పోస్టు కార్డు ఉద్యమానికి సంబంధించి కరపత్రాలు కాశీబుగ్గలోని గాంధీ విగ్రహం వద్ద ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏపీసీఎల్‌సీ నాయకుడు పత్రి దానెషు, న్యూ డెమోక్రసీ నాయకులు, కె.బాలకృష్ణ, లిబరేషన్ పార్టీ నాయకులు మద్దిల రామారావు, ఉత్తరాంధ్ర బీసీ సంఘం నాయకులు బీన ఢిల్లీరావు, ప్రజా కళా మండలి నాయకులు నీలకంఠం, రాపాక చిరంజీవి, కె.శ్రీకాంత్, ఉత్తరాంధ్ర మహిళా సంఘం నాయకులు నాగమణి, జ్యోతి, ఉత్తరాంధ్ర ప్రజా సంస్థ సభ్యులు రొయ్య నాగరాజు, పాపారావు, శేఖర్, ప్రసాద్, జగన్నాధం, ఢిల్లీ, వెంకీ, అనిల్, సంజయ్‌లు మాట్లాడారు.

## ఘనంగా రుద్రాభిషేకం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

సత్య సాయిబాబా 99వ జయంతి వేడుకలు బ్యాంకర్స్ కాలనీ సాయి బృందావనం శ్రీ సత్యసాయి సేవా సమితిలో సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం ఓంకారం, సుప్రభాతం, మహానగర సంకీర్తన, గోపూజ, ప్రశాంతి పతాకవిష్కరణ జిల్లా అధ్యక్షులు సూర రామచంద్రరావు ఆధ్వర్యంలో జరిగాయి. మందిరంలోని ముక్తేశ్వర స్వామికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకం ప్రముఖ జ్యోతిష్య పండితులు తెన్నేటి సునీల్ శర్మ సారధ్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రామచంద్రరావు మాట్లాడుతూ జిల్లాలోని సుమారు 200 సత్యసాయి మందిరాల్లో బాబా జయంతి వేడుకలు ఈ నెల 23వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆధ్యాత్మిక సమన్వయ కర్త అనాధగుప్త, స్కిల్ డెవలప్మెంట్ ఇన్‌ఛార్జి బోయిన నరసింహమూర్తి, నేషనల్ నారాయణసేవ ఇన్చార్జ్ అప్పారావు, భజన్స్ ఇన్‌ఛార్జి గంగాధర్, యువ సమన్వయకర్త ఎ.శివకుమార్, కన్వీనర్ అల్లాడ ప్రసాదరావు, డోకి జనార్ధన్, బాలరాజు, సురేష్ చరణ్ యామిని, ప్రమీల, సుజాత, పుణ్యవతి, ఉష, సేవాదళ్ భక్తులు పాల్గొన్నారు.



## అంతర్రాష్ట్ర కరాటే పోటీల్లో సిక్కోలు క్రీడాకారుల ప్రతిభ

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఇటీవల విశాఖపట్నంలో జరిగిన అంతర్రాష్ట్ర కరాటే పోటీల్లో శ్రీకాకుళం జిల్లాకు చెందిన సాయిబాబాస్ మార్షల్ ఆర్ట్స్ సంస్థ క్రీడాకారులు ప్రతిభ కనబరిచారు. ఎనిమిది మంది స్వర్ణ, ఆరు రజిత, పది కాంస్య పతకాలు సొంతం చేసుకున్నారు. విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు మున్సిపల్ వైఎస్సార్ కళ్యాణ మండపంలో ఏపీడబ్ల్యుజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కొంక్యాన వేణుగోపాల్ అధ్యక్షతన వివిధ సంస్థల ప్రతినిధుల సమక్షంలో అభినందించారు. ప్రధాన శిక్షకులు వై.హేమంత్‌కుమార్, వాకర్స్ ఇంటర్నేషనల్ ఎలక్ట్ గవర్నర్ కొంక్యాన మురళీధర్, పూర్వపు గవర్నర్ జి.ఇందిరాప్రసాద్, వాకర్స్ సంస్థ జిల్లా కార్యదర్శి సంజీవరావు, మీడియా జేఏసీ కన్వీనర్ ఎస్.జోగినాయుడు, లయన్స్ ఇంటర్నేషనల్ జిల్లా చైర్మన్ నటుకుల మోహన్, జిల్లా ప్రతినిధి పొన్నాడ రవికుమార్ క్రీడాకారులను అభినందించారు. క్రీడాకారులకు సర్టిఫికెట్లు, మెడల్స్, గ్రాండ్ మాస్టార్ మండా విజయ్‌కుమార్, శిక్షకులు డి.హరీషు జ్ఞాపికలు అందజేశారు.



## చలో శ్రీకాకుళం విజయవంతం చేయండి



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా ఎస్సీ /ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో ఈ నెల 29న ఏడురోడ్ల కూడలి నుంచి జిల్లా పరిషత్ మీదుగా కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ, బహిరంగ సభ నిర్వహించడం జరుగుతుందని దళిత నాయకులు తెలిపారు. ఇందుకు సంబంధించిన కరపత్రాన్ని సోమవారం ఇలిసిపురంలోని అంబేద్కర్ విజ్ఞాన మందిర్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో దళిత నాయకులు, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆర్.అప్పారావు, వాడాన కృష్ణారావు, జి.ఇల్లయ్య, కళ్లేపల్లి రాంగోపాల్, జిల్లా ఎస్సీ /ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి కన్వీనర్ తైక్వాండో శ్రీను, కో-కన్వీనర్ డాక్టర్ కంత వేణు, రాయి వేణుగోపాల్, బోనెల రమేష్, బొడ్డేపల్లి భూపతిరావు, యజ్జల గురుమూర్తి, సీర రమేష్‌బాబు, సీర రాజేశ్వరి, గండి ఉమామహేశ్వరరావు, కె.శ్రీనివాసరావు, టి.గోవిందరావు, కె.రామారావు, బొత్స భాస్కరరావు, పంకు ప్రసాద్, లుట్ట విజయకుమార్, రేగాన రామకృష్ణ, యడ్ల జానకిరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ షెడ్యూల్డ్ కులాలు, తెగల వర్గీకరణపై రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును రాష్ట్రపతి నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. హక్కుల పరిరక్షణకు ఎస్సీ, ఎస్టీ సామాజికవర్గాల ప్రజలు ఉద్యమిస్తున్న క్రమంలో 29న జిల్లా కేంద్రంలో నిర్వహించబోయే భారీ ర్యాలీ, బహిరంగ సభకు ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా నలుమూలల నుంచి వేలాదిగా దళిత, గిరిజన ప్రజలు హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు.

## కృష్ణవేణి కుటుంబానికి సిక్కోలు సేవాసమితి సాయం

(సత్యంన్యూస్, గార)

శ్రీకూర్మం గ్రామానికి చెందిన లాడి కృష్ణవేణి కష్టపడుతూ కుటుంబాన్ని పోషించేవారు. ఉండటానికి ఇల్లు కూడా లేక కన్నవారి వద్దే ఉంటోంది. ఆ ఇంట్లో నలుగురిని ఈమె పోషిస్తున్నారు. అయితే రెండు నెలల క్రితం ఈమెకు ప్రమాదం జరగడంతో కొంతమంది సహాయంతో ఆపరేషన్ చేశారు. వచ్చిన రేషన్ బియ్యం, అమ్మమ్మ పెన్షన్‌తో జీవనం సాగిస్తున్నారు. ఆపరేషన్ చేసిన గాయానికి ఇప్పుడు ఇన్ఫెక్షన్ కావటంతో వైద్యానికి దాతల సహాయం కోరారు. సోమవారం సిక్కోలు స్వచ్ఛంద సేవాసమితి తరఫున రూ. 10వేలు ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు అవినాష్, శేఖర్, బాలకృష్ణ, జగదీష్ పాల్గొన్నారు.




## విద్యార్థులకు వ్యాసరచన పోటీ

(సత్యంన్యూస్, సీతంపేట)

జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఐదో రోజు పిల్లలకు వ్యాసరచన పోటీ నిర్వహించారు. స్థానిక గవర్నమెంట్ హైస్కూల్‌లో 35 మంది విద్యార్థినీ విద్యార్థులకు 'యువతపై మాదక ద్రవ్యాల ప్రభావం' అనే అంశంపై వ్యాసరచన నిర్వహించారు. విజేతలకు వారోత్సవాల ముగింపు రోజున బహుమతులు ఇస్తారన్నారు. కార్యక్రమంలో స్కూల్ అసిస్టెంట్లు ఎం.శివకుమార్, ఫాణిగ్రహి, గిరిజ, లక్ష్మణరావు పాల్గొన్నారు. గ్రంథాలయ అధికారి బబ్బురు గణేష్‌బాబు, సహాయకుడు రామకృష్ణ పాల్గొన్నారు.



## విద్యార్థి భవిష్యత్తుకు అపార్ కీలకం

### - ఆధార్‌లో తప్పలుంటే సరిదిద్దాలి
### - జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

అపార్ నమోదు విద్యార్థికి భవిష్యత్తులో అత్యంత కీలకమని, విద్యార్థుల అపార్ ఐడీలు నమోదు వేగవంతం చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలలు 114 ఉండగా, అపార్ కార్డు నమోదు తక్కువ శాతం ఉండడం, అందులో శ్రీకాకుళం ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాలలో 1,277 మంది బాలికలకు అపార్‌కార్డు నమోదు చేయవలసి ఉండగా, తక్కువ శాతం నమోదవడంతో సోమవారం ఉదయం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, విద్యాశాఖ, ఆర్ఐఓ, డివిఈవో, మున్సిపల్ కమిషనర్, కళాశాల ప్రిన్సిపాల్‌తో కలసి శ్రీకాకుళం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో జరుగుతున్న ప్రక్రియను పరిశీలించి, పలువురు బాలికలకు సంబంధించిన అపార్ ప్రక్రియ వెబ్‌సైట్‌లో పరిశీలించి వేగవంతం చేయాలని సూచించారు.

ఆధార్‌లో ఎటువంటి సమస్యలున్నా త్వరితగతిన పరిష్కరించి 'అపార్' ఐడీలు జనరేట్ చేయడం వేగవంతం చేయాలన్నారు. 'అపార్' నమోదు విద్యార్థికి భవిష్యత్తులో అత్యంత ఉపయోగకరమైన ప్రక్రియని, అందువల్ల పిల్లలకు సహాయపడుతూ పూర్తి చేయాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. జిల్లాలో 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు 'అపార్' నమోదు ప్రక్రియలో మనం 80 శాతం పూర్తిచేశామని, ఇది అందరి కృషి వల్లనే సాధ్యపడిందన్నారు. మిగిలిన 20 శాతం మైలురాయిని దాటాలంటే మరింత శ్రద్ధ, కృషి అవసరమన్నారు. ఈ 'అపార్' పరిశీలనా కార్యక్రమంలో విద్యాశాఖాధికారి తిరుమల చైతన్య, ఆర్ఐవో దుర్గారావు, డీవీఈవో తవిటినాయుడు, మున్సిపల్ కమిషనర్ పివివిడి ప్రసాదరావు, బాలికల ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.కృష్ణవేణి కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## శ్రీ గాయత్రీదేవికి అష్టోత్తర పుస్తకార్చన

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



విశాఖపట్నం చిన్నముషిడివాడలోని శారదా పీఠానికి కొంచెం దూరంలో గల శ్రీ పంచముఖి గాయత్రీదేవి ఆలయంలో అష్టోత్తర పుస్తకార్చన నిర్వహించారు. కాశిన వెంకటేశ్వరరావు, రమణమ్మ దంపతులు తమ స్వీయ రచనగా శ్రీ వేదజనని గాయత్రి అనే 108 పుస్తకాలతో విశ్వజయము గ్రూప్ సభ్యుల పిల్లల శ్రేయస్సు కోసం అమ్మవారికి అర్చన జరిపించి, వాటిని భక్తులకు వితరణ చేయమని ఆలయ ధర్మకర్త సరస్వతుల నరసింహమూర్తికి అందజేశారు. ఈ పుస్తకంలో శ్రీ గాయత్రీదేవి చరిత్రతో పాటు పురాణ ప్రసిద్ధ, సుప్రసిద్ధ, విచిత్రమైన ఏకముఖి గాయత్రీ దేవి, పంచముఖి గాయత్రీదేవికి చెందిన 108 ఆలయాల విశేషాలను, ఆరాధనా స్తోత్రాలను పొందుపర్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానార్చకులు వారణాశి వెంకట నర్సిం హమూర్తి, దయంత్రి శ్రీకాంత్, సునీత, కొండపల్లి జీవన్‌కుమార్, దీపిక, హన్వితా భ్రామరి పాల్గొన్నారు.

Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.